# మంత్రి సభ సక్సెస్

## భారీగా కల్వకుర్తికి తరలిన పార్టీ శ్రేణులు

కల్వకుర్తి రూరల్, అక్టోబర్ 1 : ఆదివారం కల్వకుర్తి పట్టణంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్య శాఖమంత్రి తన్నీరు హరీశ్‌రావు బహిరంగ సభ సక్సెస్ అయ్యింది. ఆమనగల్లులో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన అనంతరం మధ్యాహ్నం 3.30 గంటలకు పట్టణంలో ప్రజలకు అభివాదం చేస్తూ చేరుకున్న మంత్రి హరీశ్‌రావును ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌తో పాటు ప్రజాప్రతినిధులు, కలెక్టర్ ఉదయ్‌కుమార్, ఆర్డీవో శ్రీను, అధికారులు పుష్పగుచ్ఛాలను అందించి స్వాగతం పలికారు. పట్టణంలోని సర్వే99లో రూ.17.5 కోట్ల అంచనా వ్యయంతో వందపడకల దవాఖాన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అదేవిధంగా రూ.45కోట్లతో మిషన్ భగీరథ యూనిట్, రూ.10 కోట్లతో నిర్మాణం పూర్తైన ఇంటిగ్రేటెడ్ మార్కెట్, సెగ్రిగేషన్ షెడ్‌లను ఆయన ప్రారంభించారు. కాగా పట్టణంలో పీఏసీసీఎస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం మంత్రి హరీశ్‌రావుకు చిత్రపటం జ్ఞాపిక అందజేశారు. యాదవ సంఘం నాయకులు మంత్రికి గొర్రెపిల్ల, గొంగలిని వేసి సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మంత్రికి వినతులు అందించారు. సభలో మంత్రి ప్రసంగం బీఆర్ఎస్ పార్టీ నాయకుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. సభ ముగిసిన తర్వాత హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు తిరిగి వెళ్లారు.

మండలాల నుంచి పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో హాజయ్యారు. పట్టణంలోని సర్వే నెంబర్99లో వందపడకల దవాఖాన నిర్మాణ స్థలం వద్ద భారీ బహిరంగ సభ నిర్వహించారు. మంత్రి పర్యటన సందర్భంగా పట్టణంలోని ప్రధాన చౌరస్తాలు, కూడళ్లు ఫ్లెక్సీలు, గులాబీ వర్ణితమైనాయి. గ్రామాల నుంచి పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కార్యకర్తలు, పార్టీ అభిమానులు, రైతులు, మహిళలు వాహనాల్లో పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు తదితరులు ఉన్నారు.


మంత్రి హరీశ్‌రావుకు ఫొటోను బహుకరిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం

**వంగూరు నుంచి..**

వంగూరు, అక్టోబర్ 1 : నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు వస్తున్న మంత్రి హరీశ్‌రావు సభకు హాజరయ్యేందుకు ఆదివారం మండలంలోని బీఆర్ఎస్ నేతలు తరలారు. మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పెద్దఎత్తునా నేతలు తరలివెళ్లారు. వారిలో సింగిల్‌విండో చైర్మన్ సురేందర్‌రెడ్డి, యాదవసంఘం జిల్లా అధ్యక్షుడు లాలుయాదవ్, మార్కెట్ వైస్‌చైర్మన్ రాజేందర్‌రెడ్డి, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు హమీద్, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు గణేశ్‌రావు తదితరులు వున్నారు.

**వెల్దండ నుంచి..**

వెల్దండ, అక్టోబర్ 1 : ఆదివారం నిర్వహించిన మంత్రి హరీశ్‌రావు సభకు మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివెళ్లారు. మండల కేంద్రంతో పాటు రాచూర్, చెర్కూర్, కుప్పగండ్ల తదితర గ్రామాల నుంచి కార్యకర్తలు సభకు వెళ్లారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భూపతిరెడ్డి, నాయకులు జయప్రకాశ్, వెంకటయ్యగౌడ్, శేఖర్, ఎంపీటీసీ వెంకటయ్య, ఉపసర్పంచ్ నర్సింహ ఉన్నారు.


వెల్దండ : చెర్కూర్ నుంచి సభకు తరలుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలు


మంత్రికి జ్ఞాపికను అందజేస్తున్న యాదవ సంఘం నాయకులు


మార్చాల గ్రామం నుంచి సభకు వస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో


జంగునాయక్‌ను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న భూపతిరెడ్డి

వెల్దండ, అక్టోబర్ 1 : సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లోకి చేరుతున్నారని పార్టీ మండలాధ్యక్షుడు భూపతిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో వైఎస్ఆర్టీపీ మండలాధ్యక్షుడు జంగునాయక్ భూపతిరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమాభివృద్ధి పథకాలకు ఆకర్షించి పార్టీలో చేరారు. ఆయనకు భూపతిరెడ్డి బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ జయప్రకాశ్ తదితరులు ఉన్నారు.

## బీఆర్ఎస్‌తోనే సుస్థిర పాలన

వంగూరు, అక్టోబర్ 1 : రాష్ట్రంలో సుస్థిర పాలన అందించాలంటే బీఆర్ఎస్‌తోనే సాధ్యమని బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు గణేశ్‌రావు ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. 9 ఏండ్ల పాలనలో రాష్ట్రం ఎంతో ప్రశాంత వాతావరణంలో అభివృద్ధి చెందిందన్నారు. సీఎం కేసీఆర్ కొత్తగా ఏర్పడిన రాష్ట్రాన్ని తన అనుభవాన్ని రంగరించి తెలంగాణను దేశంలోనే ఆర్థికంగా బలమైన రాష్ట్రంగా తీర్చిదిద్దారన్నారు. ప్రజలు సీఎం కేసీఆర్ వెన్నంటే ఉన్నారని, మరోసారి బీఆర్ఎస్‌కు పట్టం కట్టేందుకు సిద్ధంగా వున్నారని ఆయన పేర్కొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

చారకొండ, అక్టోబర్ 1 : మండల కేంద్రానికి చెందిన పారిశుధ్య కార్మికుడు నరేశ్ తల్లి కొప్పుపుల్లమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ అశోక్, వెంకటయ్యగౌడ్ ఆదివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం,నిత్యావసర సరుకులు అందజేశారు. వారి వెంట వెంకటయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

## జిల్లాకు 9 సైన్స్ ల్యాబ్‌లు మంజూరు

### ఒక్కో ల్యాబ్‌కు రూ.16 లక్షలు మంజూరు

కందనూలు, అక్టోబర్ 1: జిల్లా వ్యాప్తంగా జెడ్పీ పాఠశాలలో 9 సైన్స్ ల్యాబ్‌లు మంజూరయ్యాయి. ఒక్కో సైన్స్‌ల్యాబ్‌కు రూ.16లక్షలు కేటాయించారు. ఉత్తర్వులను సెప్టెంబర్ 29తేదీన రాష్ట్ర విద్యా సంచాలకుడు వెల్లడించారు. జిల్లాలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ సైన్స్ ల్యాబ్‌లు మంజూరయ్యాయి. అచ్చంపేట నియోజకవర్గంలోని అమ్రాబాద్ మండలంలో మన్ననూర్ టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్‌లో, జెడ్పీహెచ్‌ఎస్ బల్మూర్, నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల, మండలంలోని శ్రీపురం జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాల, పల్లె మండలంలోని మంగనూరు జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాల తెలకపల్లి మండలంలోని తెలకపల్లి జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాల, తిమ్మాజీపేట మండలంలోని తిమ్మాజీపేట కేజీబీవీ ఉన్నత పాఠశాలలో, కల్వకుర్తి నియోజకవర్గంలోని ఎంజేపీటీ బీసీ డబ్ల్యూ ఆర్‌ఈఐఎస్ మహిళల పాఠశాల, కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెద్దకొత్తపల్లిమండలం కేజీబీవీ ఉన్నత పాఠశాలలకు డిజైన్స్ ల్యాబ్‌లు మంజూరు కావడంపై జిల్లావాసులు హర్షం వ్యక్తం చేశారు.

# వయోవృద్ధుల హక్కులను కాపాడాలి

- **ఆర్డీవో శ్రీను వెల్లడి**


వృద్ధులను సన్మానిస్తున్న ఆర్డీవో శ్రీను

కల్వకుర్తిరూరల్, అక్టోబర్ 1 : వయోవృద్ధులను గౌరవించి వారి హక్కులను కాపాడుదామని ఆర్డీవో శ్రీను, ఎంపీపీ మనోహర అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్డీవో, ఎంపీపీతో పాటు పలువురు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ సంతానానికి డబ్బులు ఎలా సంపాదించడం నేర్పుతారో వాటితో పాటు పెద్దలను గౌరవించడం, విలువలు, సమాజం పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. వృద్ధులను నిరాధరణకు గురిచేయకుండా వారిని ఆదరించి ప్రేమను పంచాలన్నారు. వృద్ధులను హింసించడం, వేధించడం చట్టరీత్యా నేరమని, వారికి రాజ్యాంగం ప్రత్యేకమైన హక్కులను కల్పించినట్లు తెలిపారు. వృద్ధులకు ఏవైనా సమస్యలు తలెత్తితే ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. వృద్ధులను వృద్ధాశ్రమంలో చేర్పించడం సరికాదన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ రాజేందర్‌రెడ్డి, ఐసీడీఎస్ సీడీపీవో వెంకటమమ్మ, సూపర్‌వైజర్ పద్మావతి, సీనియర్ సిటిజన్లు, పెన్షనర్ల సంఘం పాల్గొన్నారు.

## కల్వర్టు నిర్మాణ పనులు పూర్తి

తాడూరు, అక్టోబర్ 1 : మండలంలోని చర్లఇటిక్యాల సమీపంలో కల్వర్టు నిర్మాణ పనులు సకాలంలోనే పూర్తి చేయడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షం వస్తే భారీగా వరద వచ్చేదని, దీంతో రోడ్డు దాటాలంటే ఇబ్బందులు పడేవారమని గ్రామస్తులంటున్నారు. గ్రామం నుంచి ఎండబెట్లకు వెళ్లే ప్రధాన రహదారికి మరమ్మతులు చేశారు. గ్రామ సమీపంలోని చెరువు, వ్యవసాయ భూముల్లోని నీరు అలుగులు పారడంతో రోడ్డు దాటాలంటే ఇబ్బందులు పడ్డామన్నారు. కాగా కొంతమంది ప్రమాదాలకు గురైన ఘటనలు కూడా ఉన్నాయన్నారు. సమస్యలను ప్రజాప్రతినిధులకు గ్రామస్తులు విన్నవించడంతో ఎమ్మెల్యే మర్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. కల్వర్టు నిర్మాణంతో సమస్యలు తీరాయని ప్రజలు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.


చర్లఇటిక్యాల సమీపంలో పూర్తయిన కల్వర్టు

## గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

కల్వకుర్తి రూరల్, అక్టోబర్ 1 : గ్రామీణ ప్రాంత ప్రజలు తమ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ స్వచ్ఛ గ్రామాలుగా తీర్చుదామని ఎంపీపీ సామ మనోహర అన్నారు. ఆదివారం మండలంలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛతాహీసేవా కార్యక్రమాన్ని గ్రామాల ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించారు. మార్చాలలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో ఎంపీపీ పాల్గొని ప్రధాన రహదారులను గ్రామస్తులతో కలిసి శుభ్రం చేశారు. పల్లెలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని పరిసరాల పరిశుభ్రతపైన అవగాహన కల్పించారు. మహాత్మాగాంధీ ఎల్లప్పుడు శ్రమదాన కార్యక్రమాలు నిర్వహించేవాడని ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సునీత, నాయకులు మల్లేశ్, లింగం, ఎంపీడీవో ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి రమేశ్ తదితరులు ఉన్నారు.


మార్చాలలో రోడ్డును శుభ్రం చేస్తున్న ఎంపీపీ, తదితరులు

**చారకొండలో**

చారకొండ, అక్టోబర్ 1 : పరిసరాలు పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో జయసుధ అన్నారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని వివిధ గ్రామాల్లో, పాఠశాలల్లో శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచాలని, చెత్తచెదారం, మురుగునీరు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో వెంకటేశ్, ఏపీవో లక్ష్మయ్య, ఏపీఎం బాలచందర్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.


చారకొండలోస్వచ్ఛతాహీ సేవా పాల్గొన్న ఎంపీడీవో జయసుధ